ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 11 ఫిబ్రవరి 2025


• టీచర్.. ఫైట్!

తొలి అంకం పూర్తి

ముగిసిన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల ఘట్టం

- 50 సెట్లు దాఖలు చేసిన 23మంది అభ్యర్థులు
- నేడు నామినేషన్ల పరిశీలన.. 13వ తేదీ వరకు ఉపసంహరణ
- 12 జిల్లాల్లో 200 పోలింగ్ కేంద్రాల్లో 27న పోలింగ్
- ఎమ్మెల్సీ పరిధిలో 25,797 మంది ఉపాధ్యాయ ఓటర్లు
- కీలక నేతలను బరిలో దించిన ఉపాధ్యాయ సంఘాలు, బీజేపీ

7



వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో తొలి అంకం పూర్తయింది. సోమవారం నామినేషన్ల ఘట్టం పూర్తవగా.. 23 మంది అభ్యర్థులు 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో పలువురు కీలకనేతలుండగా.. మంగళవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. అయితే 13వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉన్న నేపథ్యంలో ఎవరెవరు బరిలో ఉంటారనేది ఆ రోజే స్పష్టత రానుంది. ఇక ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పలు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు తమ, తాము మద్దతిచ్చే అభ్యర్థుల విజయంపై దృష్టిపెట్టాయి. మరోసారి ఎమ్మెల్సీ సీటును కైవసం చేసుకునేందుకు యూటీఎఫ్ ప్రయత్నిస్తుండగా, పాత స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని పీఆర్‌టీయూ ఎత్తులు వేస్తోంది. ఈ రెండు సంఘాలను ఎదుర్కొనేందుకు బీజేపీ, ఇతర సంఘాలు కీలక నేతలను బరిలో దించుతున్నాయి. దీంతో టీచర్ ఫైట్ మరింత రసవత్తరంగా మారుతోంది. కాగా, ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో 25,797మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పురాతన ఆలయాలకు మహర్దశ కల్పిస్తాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నవాబుపేట శివాలయంలో పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాలకు మహర్దశ కల్పిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని నవాబుపేటలో కాకతీయులకాలం నాటి పురాతన శివాలయం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం జరగ్గా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. మహిళలు మంగళహారతులు పట్టారు. అనంతరం పునఃప్రతిష్ఠాపనలో భాగంగా అర్చకులు రఘునందన్ స్వామి ఆధ్వర్యంలో ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు జరిగాయి. సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ 200 సంవత్సరాల పురాతన ఆలయం పునఃప్రతిష్ఠాపన జరగడం శుభపరిణామన్నారు. ఆలయాలకు మరమ్మత్తు పనులు చేయించడంతోపాటు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వాటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. మహాశివుడి ఆశీస్సులు గ్రామస్థులపై ఉండాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు కసిరెడ్డి సాయిసుధ రత్నాకర్‌రెడ్డి, సర్వ శరత్, కామిడి రత్నాకర్‌రెడ్డి, దబ్బెట అనిల్, పువ్వాటి వెంకటేశ్వర్లు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆ పార్టీ భూపాలపల్లి, గణపురం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పూర్తిగా సంక్షేమాన్ని విస్మరించిన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యర్తలను కోరారు. సాధ్యం కాని హామీలను ప్రజలకు ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. మరో 15 రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, నాయకులు, కార్యకర్తలు ఇందుకు సన్నద్ధం కావాలని అన్నారు. ప్రజలకు అండగా ఉంటూ ప్రతిపక్ష పాత్రను సమర్థంగా నిర్వర్తించాలన్నారు. ఓటు అనే అస్త్రంతో కాంగ్రెస్ చేతిని విరగొట్టాలని వ్యాఖ్యానించారు. అధిక స్థానాల్లో సర్పంచ్, ఎంపీటీసీ సీట్లు కైవసం చేసుకునేలా సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ నిరంతరం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు తప్ప మరే పార్టీకి లేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు కళ్లెపు రఘుపతిరావు, మండల విద్యాసాగర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డితో పాటు గణపురం మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

కాటారం మండలం విలాసాగర్‌లో ఘటన

సొంత పార్టీ నేతల తీరుపై మనస్తాపం!

కాటారం, ఫిబ్రవరి 10: భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని విలాసాగర్ మాజీ సర్పంచ్ అందె సత్యనారాయణ సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సుమారు 20 ఏళ్ల క్రితం సర్పంచ్‌గా ప్రాతినిధ్యం వహించిన సత్యనారాయణ సొంత పార్టీ కాంగ్రెస్‌పై పలు ఆరోపణలు చేశారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నానని, ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి మంత్రి శ్రీధర్‌బాబు ప్రాధాన్యమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఇళ్లకు వెళ్లొద్దని మంత్రికి చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వేరే పార్టీనుంచి వచ్చిన వారే మంత్రి కారులో కూర్చోవడం, వారికి పనులు అవుతుంటే కాంగ్రెస్ నాయకులు బాధపడుతున్నారని, తన చావుతోనైనా అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానని వీడియోలో పేర్కొన్నారు. పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సత్యనారాయణను కుటుంబసభ్యులు వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మేడారంలో చిన్న జాతర సందడి



వనదేవతలకు మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

- రేపటి నుంచి నాలుగు రోజుల పాటు మినీ వేడుక
- తరలివస్తున్న భక్తులు.. పూర్తయిన ఏర్పాట్లు

వివరాలు 7వ పేజీలో..

ఎమ్మెల్సీ ఎన్నికను పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరుగనున్న ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వ హణపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 329 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 13 మంది పీవో, 12 మంది ఏపీవోలు, 24 మంది ఓపీవోలను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన హ్యాండ్‌బుక్‌పై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. 27 ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగు తుందన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగా దీనికి మాక్ పోలింగ్ ఉండదన్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌ను సీల్‌చేసిన తర్వాతే పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈనె ల 23న కలెక్టరేట్‌లోని జీ5 రూంలో ఎదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, శిక్షణ నోడల్ అధికారి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గొంతెమ్మగుట్ట మహాజాతర

చివరి రోజు గొంతెమ్మ, లక్ష్మీదేవర పట్నాలు, బోనాలు

కిటకిటలాడిన పరిసరాలు



పాండవభేరి వద్ద మొక్కుకుంటున్న భక్తులు

కాటారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంతెమ్మగుట్టపై లక్ష్మీదేవర మహాజాతర అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగిన ఈ వేడుక సోమవారం ముగిసింది. ప్రతాపగిరి సమీపంలోని అటవీప్రాంతంలో గొంతెమ్మ గుట్టపై ఈ జాతరను నిర్వహించారు. చివరి రోజు పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో నాయకపోడ్ కులస్థులు హాజరయ్యారు. పెద్దపల్లి, ములుగు, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 15కి పైగా లక్ష్మీదేవరలతో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య గొంతెమ్మ, లక్ష్మీదేవర పెద్ద పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీదేవరలు, శివసత్తుల విన్యాసాలతో పట్నాలు తొక్కించే కార్యక్రమం జరిగింది. పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నేతలు జాతరలో పాల్గొని దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాలతో పాటు మహారాష్ట్రకు చెందిన వందలాది మంది భక్తులు ట్రాక్టర్లు, బైకులు, ఆటోలు, కార్లు, జీపుల్లో అటవీమార్గం మీదుగా జాతరకు తరలి వచ్చారు. గుట్టపై సొరంగంలోని కొల్లుగుంట, గొంతెమ్మ, కృష్ణుడి పాదాలు, శివ లింగానికి మొక్కుకున్నారు. ఇరుకైన దారి మీదుగా భక్తులు త్వరగా వెళ్లడానికి దూసుకురాగా పోలీసులు, నిర్వాహకులు ఒక్కోసారి కొద్దిమందిని వదులుతూ దర్శనం కల్పించారు. సీఐ నాగార్జునరావు నేతృత్వంలో ఎస్సైలు

» మిగతా 8వ పేజీలో...

దుబ్బగూడేనికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

గంగారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మారుమూల ప్రాంతమైన దుబ్బగూడెంకు నర్సంపేట ఆర్టీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు మేనేజర్ ప్రసూనలక్ష్మీ సోమవారం తెలిపారు. మేడారం జాతర సందర్భంగా నర్సంపేట నుంచి ఉదయం 7.30 గంటలకు దుబ్బగూడెంకు మొదటి బస్సు సర్వీసు బయలుదేరుతుందని చెప్పారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రెండో ట్రిప్పు బయలుదేరుతుందని అన్నారు. ఇది పూనుగొండ్లలో జరిగే పగిడిద్దరాజు జాతర ముగిసే వరకు తాత్కాలికంగా నడిపిస్తామన్నారు. దుబ్బగూడెంకు బస్సు రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌కు 10వేల బస్తాల మిర్చి రాక



మహబూబాబాద్ మార్కెట్‌లోకి వచ్చిన మిర్చి బస్తాలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 10వేల బస్తాల వరకు మిర్చి రాబడులు కొనసాగాయి. ఈ సీజన్‌లో ఇన్ని వేల బస్తాలు మార్కెట్‌కు రావడం ఇదే మొదటిసారి అయితే కేవలం 6వేల బస్తాల వరకే ఈ నామ్‌లో మార్కెట్ అధికారులు టోకెన్‌లు ఇచ్చారు. ఆ బస్తాలకే వేలం పాటలు కొనసాగాయి. మిగిలిన బస్తాలకు మంగళవారం టోకెన్‌లు ఇచ్చే అవకాశం ఉంది. ఈ నామ్‌లో ఖరీదులు చేసిన కాంటాలు మాత్రం సోమవారం రాత్రి వరకు పూర్తయ్యే అవకాశం లేదు. మరో రోజు పట్టే అవకాశం ఉంది. మార్కెట్‌లో తేజ మిర్చి క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.13,989 కాగా, కనిష్ఠ ధర రూ.11,210 సగటున రూ.13,118 ధర పలికింది.

పదో తరగతి విద్యార్థులకు
పరీక్షలపై శిక్షణ ఇవ్వాలి

» ములుగు డీఎస్‌సీడీవో లక్ష్మణ్ నాయక్



ఎస్సీ హాస్టల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై సూచనలు ఇస్తున్న ఉపాధ్యాయులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై ముందస్తుగా శిక్షణ తరగతులను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని ములుగు డీఎస్‌సీడీవో లక్ష్మణ్ నాయక్ సూచించారు. సోమవారం ములుగు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండలకేంద్రంలోని ఆకులవారిఘణపురం ఎస్సీ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. మార్చి నెలలో జరిగే ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షలకు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు సిద్ధమయ్యేలా ఉపాధ్యాయులు మోటివేషన్, శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులకు సూచనలు, సలహాలను అందించాలని ఆయన తెలిపారు.

పరీక్షలకు ఇంకా 40 రోజులే గడువు ఉందని, ప్రత్యేకించి ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సైన్స్, మ్యాథ్స్ వంటి ముఖ్యమైన సబ్జెక్టులపై అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో విద్యార్థులు పరీక్షలకు సమర్థంగా సిద్ధమయ్యే అవకాశం, చదువుపై ఆసక్తి పెంపొందించే మోటివేషన్, సమయ నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు, హాస్టల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంత పనిచేశావమ్మా!

- కన్నప్రేమను మరిచి.. కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి..
- పిల్లలిద్దరిని హతమార్చేందుకు ప్రయత్నించిన తల్లి
- ఆపై తానూ ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం
- చిన్నారుల పరిస్థితి విషమం
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో ఘటన
- కుటుంబ పరిస్థితుల నేపథ్యమే కారణమని సమాచారం



డోర్నకల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూల్ డ్రింక్‌లో గడ్డిమందు కలిపి వారికి తాపించి.. ఆపై తానూ ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం జోగ్యతండలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన గురించి చిన్నారుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివీ.. జోగ్యతండాకు చెం దిన వాంకుడోతు వెంకటేష్, ఉష దంపతులకు వరుణ్‌తేజ్, నిత్యశ్రీ అనే చిన్నా రులున్నారు. అయితే వెంకటేష్ అనారోగ్యం బారిన పడి గతేడాది అక్టోబరు 11న మృతి చెందాడు. దీంతో ఉష తన పిల్లలిద్దరితో కలిసి జోగ్యతండాలోనే తన అత్తమామ ఇంటిపక్కనే నివాసం ఉంటూ కూలి పనులకు వెళుతూ జీవ నం కొనసాగిస్తోంది. ఈ నెల 5వ తేదీన పిల్లలిద్దరు ఒక్కసారిగా అస్వస్థతకు గురై వాంతులు చేసుకుంటుండగా తమ బంధువులతో కలిసి ఉష వారిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. వారిద్దరూ కూల్‌డ్రింక్ తాగిన తర్వాత అస్వస్థతకు గురైనట్లు ఆమె వైద్యులకు తెలిపింది. దాంతో వైద్యులు చికిత్స ప్రారంభించి.. రక్త, మూత్ర నమూనాలు సేకరించారు. ఆ పరీక్షల్లో కూల్ డ్రింక్ తాగడం వల్ల వచ్చిన అనారోగ్యం కాదని వైద్యులు గుర్తించారు. కానీ అప్పటికే రెండు రోజులు కావడం, చిన్నారుల ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని సూచించడంతో.. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వారికి వైద్య పరీక్షలు నిర్వహించి గుర్తు తెలియని కంపెనీకి చెందిన గడ్డిమందు తాగినట్టు అనుమానం ఉందని చెప్పడంతో.. చిన్నారుల బంధువులు ఉషను నిలదీశారు. అప్పటి వరకు కూల్ డ్రింక్ తాగడం వల్లే చిన్నారులు అస్వస్థతకు గురయ్యారని చెప్పిన ఉష. తన పిల్లలకు తానే కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి తాపించానని చెప్పడంతో వారంతా అవాక్కయ్యారు. వెంటనే ఆ చిన్నారులను హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అయితే తాను చేసిన పని తెలియడంతో తనపై కుటుంబసభ్యులు దాడి చేస్తారని, తన పరువుపోయిందని భావించిన ఉష నిలోఫర్ ఆసుపత్రి వద్ద ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా.. ఆమెను కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండగా.. వెంటనే చికిత్స అందడంతో ఉష ప్రాణాపాయం నుంచి బయటపడిందని సమాచారం.

అయితే ఈ ఘటనపై చిన్నారుల నానమ్మ వాంకుడోతు బుజ్జి డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్నామని డోర్నకల్ సీఐ రాజేష్ సోమవారం తెలిపారు. విచారణ నిమిత్తం పోలీస్ సిబ్బందిని హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి పంపామన్నారు. అయితే ఇటీవలే భర్త చనిపోగా.. కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్న ఉష తన పిల్లలకు విషమిచ్చి చంపాలని ఎందుకు ప్రయత్నించచదనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. కూలి పనులు చేసుకునే ఆమె కుటుంబ పరిస్థితుల నేపథ్యంలోనే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టి ఉంటుందన్న చర్చ జరుగుతోంది.



నస్తూరుపల్లి అడవిలోని వాగులో అడుగుల జాడలు

నస్తూరుపల్లి అడవుల్లో
పెద్దపులి కలకలం

కాటారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని నస్తూరుపల్లి అడవుల్లో పెద్దపులి సంచారం కలకలం రేపింది. మహదేవపూర్ రేంజ్ పరిధిలోని ఈ అడవుల్లో సోమవారం పెద్దపులి సంచరించినట్లు గుర్తించారు. పలుచోట్ల పెద్ద పులి అడుగులుకనిపించడంతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. నస్తూరుపల్లి గ్రామానికి చెందిన వెంకటి అనే వ్యక్తి తన పశువుల కోసం అడవిలోకి వెళ్లి వస్తుండగా మహదేవపూర్ దిశగా వెళ్తున్న పెద్ద పులి కనిపించిందని స్థానికులు అంటున్నారు. కొందరు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా డిప్యూటీ రేంజర్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది అడవుల్లోకి వెళ్లి చేశారు. పలు చోట పులి పాదముద్రలు కనిపించాయి. దీంతో పులి ఎప్పుడు వచ్చింది.. ఎటు వెళ్లిందని అటవీ శాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. ప్రజలు అడవుల్లోకి వెళ్లొద్దని సూచిస్తున్నారు. డిప్యూటీ రేంజర్ రాజేశ్వర్ మాట్లాడుతూ పెద్దపులి సంచారం వాస్తవమేనని, అది ఎటు వెళ్లిందో తెలుసుకోవడానికి పూర్తిస్థాయిలో మంగళవారం అడవులను పరిశీలిస్తామన్నారు.

బైక్ అదుపుతప్పి..చెట్టును ఢీ కొట్టి
'భగీరథ' ఉద్యోగి మృతి



రాజేష్ (ఫైల్)

డోర్నకల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో మిషన్ భగీరథ ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి డోర్నకల్ మండలం గొల్లచర్ల వద్ద చోటుచేసుకుంది. డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం... గూడూరు మండలం నాయకపల్లికి చెందిన తాటికొండ రాజేష్(28) మిషన్ భగీరథలో సైట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మహబూబాబాద్ నుంచి డోర్నకల్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. గొల్లచర్ల సమీపంలోకి రాగానే మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపక్కనే ఉన్న ఓ చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో రాజేష్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు తాటికొండ అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ.3.50 లక్షల ఆస్తినష్టం

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన గూడూరు మండలం బొల్లెపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లెపల్లి గ్రామానికి చెందిన బానోత్ రామక్క నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టింది. నివాసార్థం ఓ గుడిసెలో నివాసం ఉంటోంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రామక్క తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసె(ఇల్లు) నిప్పంటుకుని దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంటి నిర్మాణం కోసం ఉంచిన రూ.లక్ష నగదుతో పాటు 20 తులాల వెండి, రూ.50వేల విలువైన బైండింగ్ వైరు, మూడు క్వింటాళ్ల బియ్యం, ఫర్నిచర్ కాలిపోయాయని రామక్క ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.



బొల్లెపల్లిలో దగ్ధమైన రామక్కకు చెందిన ఇల్లు

అయ్యో రైతన్న!



ధర్మా (ఫైల్)

- మిర్చి తోట వద్ద గుండెపోటుతో అన్నదాత మృతి
- అప్పటికే మిర్చికి ధర పలకలేదని మనోవేదన
- మార్కెట్ నుంచి ఇంటికి వచ్చి.. ఆపై పొలానికి వెళ్లి కన్నుమూత
- గార్ల మండలం సీతంపేటలో ఘటన

గార్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టం చేసి పంట పండించిన ఆ రైతుకు మార్కెట్‌లో నిరాశే ఎదురైంది.. గుండెబరువుతో తన చేను వద్దకు వెళ్లి మిర్చికి ధర పలకలేదన్న మనోవేదనలో ఉన్న ఆ రైతు పొలం వద్ద గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేటకు చెందిన బానోత్ ధర్మా(45) తనకున్న ఐదెకరాల్లో మిర్చి పంటను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇందుకోసం రూ.లక్షల్లో పెట్టుబడి కాగా.. సుమారు రూ.4లక్షల వరకు అప్పు అయ్యింది. ఇటీవల మొదటి కాపుగా చేతికొచ్చిన సుమారు 20క్వింటాళ్ల పంటను సోమవారం ఖమ్మం మార్కెట్‌కు తరలించాడు. అక్కడ క్వింటా మిర్చి రూ.11వేలు మాత్రమే పలకగా.. వచ్చిన మేరకు పంటను అమ్ముకుని ఆ మనోవేదనతోనే ఇంటికి వచ్చాడు. పంట ధర అనుకున్నంత దక్కలేదని తన కుటుంబ సభ్యుల వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ తర్వాత మళ్లీ తోటకు వెళ్లిన ధర్మా అక్కడ గుండెపోటుతో వ్యవసాయక్షేత్రంలోనే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మిర్చికి ధర పలకలేదన్న మనస్తాపంతో ఇంటికి చేరుకున్న ధర్మా పొలం వద్దకు వెళ్లి గుండెపోటుకు గురై మృతి చెందాడని, అతడిని ఆదుకోవాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలి

» అకడమిక్ మానిటరింగ్ అధికారి మల్లారెడ్డి



విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

ములుగు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతికత అంత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న నేపథ్యంలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలని విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కాటం మల్లారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ జరిగింది. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకోసం ఇలాంటి టెస్టులు ఉపయోగపడుతాయని మల్లారెడ్డి అన్నారు. ఈ పరీక్షలో గోవిందరావుపేట మండలం చల్వాయి ఉన్నత పాఠశాలకు చెందిన కారుణ్య ప్రథమ విజేతగా, ములుగు మండలం బండారుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థి రిత్విక్ ద్వితీయ, వెంకటాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి హర్షతేజ తృతీయ విజేతగా నిలిచారు. వీరికి సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఫోరం కోశాధికారి బోడెబోయిన జయరాం, ఆనంద్, శ్రవణ్ కుమార్, క్రాంతికుమార్, గడ్డంశ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష విలువైన గంజాయి పట్టివేత

» ఒడిస్సా నుంచి రవాణా.. ముగ్గురి అరెస్టు

కేసముద్రం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ ఉప్పరపల్లి రోడ్‌లో సోమవారం మధ్యాహ్నం ఎస్ఐ మురళీధర్ ఆధ్వర్యంలో ముగ్గురు వ్యక్తుల నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు చేపట్టగా బ్యాగులతో ఇంటికన్నెకు చెందిన బానోత్ హరినాద్, బయ్యారం మండలం బాల్యతండాకు చెందిన గుగులోత్ చరణ్, మరిపెడ మండలం గమ్యతండాకు చెందిన లూనావత్ ప్రవీణ్‌కుమార్‌లు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగు తనిఖీ చేయగా రూ.1లక్ష విలువైన నాలుగు కిలోల గంజాయి లభించడంతో సరుకు స్వాధీన పర్చుకొని వారిని వెంటనే అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ ముగ్గురు ఒడిస్సాలోని నబీన్ ప్రధాన్ వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేసి రైలు ద్వారా మహబూబాబాద్‌కు వచ్చి అక్కడి నుంచి కేసముద్రానికి చేరుకొని వాహనం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ ముగ్గురితోపాటు గంజాయిని విక్రయించిన నబీన్ ప్రధాన్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కేసులో ప్రతిభ చూపిన రూరల్ సీఐ, ఎస్ఐలతో పాటు పీసీలు నరేష్, రామకృష్ణ, చంద్రయ్య, మధులను జిల్లా ఎస్పీ సుధీర్‌రాం నాథ్‌కేకన్ అభినందించారు.



పట్టుకున్న గంజాయిని చూపుతున్న రూరల్ సీఐ సర్వయ్య

అధిక సాంద్రత గల పత్తి సాగు మేలు

• మానుకోట వ్యవసాయాధికారి విజయనిర్మల



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి విజయనిర్మల

కురవి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అధిక సాంద్రత గల పత్తి సాగుతో లాభాల దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల అన్నారు. కురవి మండలం బలపాల రైతువేదికలో రాజోలు, బలపాల, లింగ్యాతండ రైతులకు సోమవారం పత్తి యాజమాన్యపద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక సాంద్రత గల పత్తి తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచవచ్చునని, దీంతో పాటు ఒకేసారి పంట కోసేలా పంట విస్తీర్ణాన్ని తగ్గించుకోవచ్చన్నారు. అధిక సాంద్రత గల పత్తి సాగుతో గులాబీ రంగు పురుగు బారీ నుంచి రైతులు ఉపశమనం పొందవచ్చునన్నారు. ఈ అవగాహన సదస్సులో ప్రొఫెసర్ డాక్టర్ జి.వీరన్న, మల్యాల ప్రొఫెసర్ శ్రీమతి మాలతి, శాస్త్రవేత్త కిశోర్, ఏవో నర్సింహారావు, ఏఈవో లయ, అంబటి వెంకటనారాయణ, శ్రీనివాస్, లింగ్యానాయక్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

» పోలీసు అధికారులతో భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి కేసులను పోలీసు అధికారులు సత్వరంగా పరిష్కరించి బాధితులకు అండగా నిలవాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దివస్ కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. వాటిపై సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజల ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ నిరంతరం పని చేయాలని అన్నారు. ఆయా ఫిర్యాదులపై నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో అందించాలని ఆదేశించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

గోవిందరావుపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటల సాగుపై ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని చల్వాయిలో రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కేఎస్.బయోసైన్స్ ఫీల్డ్ ఆఫీసర్ శివకృష్ణ రైతులతో ఫీల్డ్‌విజిట్ చేపట్టారు. 12-16నెలల వయసులో మొక్కలకు గెలలు రావడం మొదలవుతుందని, వాటిని 36నెలల వయస్సు వచ్చేవరకు తొలగించాలన్నారు. మూడు నెలలకోసారి నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ఎరువులు వేయాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులు వాడవద్దన్నారు. ఆడ, మగ పూగుత్తులు ఒకే చెట్టుకు వేర్వేరుగా వస్తాయని, నీటి ఎద్దడి ఉంటే కేవలం మగగుత్తులు మాత్రమే వస్తాయని తెలిపారు. దీంతో దిగుబడి తగ్గే ప్రమాదముందన్నారు.

విద్యుదాఘాతంతో
కార్మికుడికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఓ ఇంటి నిర్మాణపనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై భవన నిర్మాణ కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలప్రకారం.. మిల్ట్రీ కాలనీకి చెందిన బూర్గుల మల్లయ్య భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం రాజీవ్‌నగర్ కాలనీలో ఓ ఇంటి స్లాబ్‌పై మల్లయ్య పనిచేస్తున్నాడు. ఆ ఇంటిపై 11కెవి విద్యుత్ వైర్లు వెళ్లాయి. అక్కడ పని చేస్తున్న మల్లయ్య ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై స్లాబ్‌పై నుంచి కిందపడ్డాడు. ఈ ఘటన మల్లయ్యకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు వెంటనే 108 ద్వార జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వరంగల్ మార్కెట్ ధరలు


(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2310	2100
పల్లికాయ (సూక)	6750	4600
పల్లికాయ (పచ్చిది)	4750	3100
కందులు	6921	5540
పెసళ్లు	6322	5645
పత్తి	6960	5800
పసుపు (కాడి)	9559	7425
పసుపు (గోల)	7070	6703
తేజ మిర్చి	13400	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14100	11500
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	13300	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

తొలి అంకం పూర్తి

ముగిసిన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల ఘట్టం



టీచర్.. ఫైట్!

- 50 సెట్లు దాఖలు చేసిన 23మంది అభ్యర్థులు
- నేడు నామినేషన్ల పరిశీలన.. 13వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం
- 12 జిల్లాల్లో 200 పోలింగ్ కేంద్రాల్లో 27న పోలింగ్
- ఎమ్మెల్సీ పరిధిలో 25,797మంది ఉపాధ్యాయ ఓటర్లు
- కీలక నేతలను బరిలో దించిన ఉపాధ్యాయ సంఘాలు, బీజేపీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం సోమవారం ముగిసింది. 23మంది కీలక నేతలు.. 50సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలించనుండగా.. 13వ తేదీ వరకు ఉపసంహరణ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పలు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టిపెట్టాయి. మార్చి 29వ తేదీతో వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో తిరిగి మరోసారి ఎమ్మెల్సీ సీటును కైవసం చేసుకునేందుకు యూటీఎఫ్ ప్రయత్నిస్తుండగా, పాత స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని పీఆర్‌టీయూ ఎత్తులు వేస్తోంది. ఈ రెండు సంఘాలను ఎదుర్కొనేందుకు బీజేపీ, ఇతర సంఘాలు కీలక నేతలను బరిలో దించటంతో ఎమ్మెల్సీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతోంది. కాగా, ఎమ్మెల్సీ పరిధిలో 25,797మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు.

బరిలో 23మంది అభ్యర్థులు..

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 23మంది అభ్యర్థులు నిలిచారు. సోమవారంతో నామినేషన్ల ఘట్టం పూర్తవడంతో 50సెట్లలో 23మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ప్రధానంగా సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి యూటీఎఫ్ నుంచి మరోసారి పోటీలోకి దిగారు. అలాగే పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, టీపీఆర్‌టీయూ నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి గాలరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తమ్‌రెడ్డి, టీచర్స్ జాక్ నుంచి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ నామినేషన్ దాఖలు చేశారు. వీరితో పాటు వరంగల్‌కు చెందిన మాజీ కూడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, డాక్టర్ కొలిపాక వెంకటస్వామితో పాటు 23మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మంగళవారం నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్ల పరిశీలన చేయనున్నారు. 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఈ నెల 27న ఎమ్మెల్సీ పోలింగ్ జరగనుండగా ఇప్పటికే అధికారయంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.





నామినేషన్ దాఖలు చేస్తున్న సుందర్‌రాజు యాదవ్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 12 జిల్లాలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం ఓటర్లు
వరంగల్	13	1474	878	2,352
హనుమకొండ	15	2943	2272	5,215
మహబూబాబాద్	16	1112	551	1663
జనగామ	12	614	388	1002
భూపాలపల్లి	07	215	114	329
ములుగు	09	405	223	628
సిద్దిపేట	04	123	43	166
నల్గొండ	37	2817	1866	4,683
సూర్యాపేట	23	1702	962	2,664
యాదాద్రిభువనగిరి	17	638	346	984
ఖమ్మం	24	2372	1717	4089
భద్రాద్రికొత్తగూడెం	23	1068	954	2022
మొత్తం	200	15,483	10,314	25,797

ఎమ్మెల్సీ సీటుపై నజర్

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటుపై పలు ఉపాధ్యాయ సంఘాలతో పాటు బీజేపీ నజర్ వేసింది. దీంతో టీచర్ ఎమ్మెల్సీ ఫైట్ టఫ్‌గా మారుతోందన్న చర్చ జరుగుతోంది. 2019 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌పై టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించారు. ఈసారి పక్కాగా ఎమ్మెల్సీ సీటు దక్కించుకోవాలని ప్రధాన ఉపాధ్యాయ సంఘాలతో పాటు టీజీ జాక్, స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీ పడుతున్నారు. అయితే ఈ ఎన్నికలను పీఆర్‌టీయూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. 2013లో పీఆర్‌టీయూ నుంచి గెలిచిన పూల రవీందర్ ఆ తరువాత బీఆర్‌ఎస్‌లోకి వెళ్లారు. దీంతో ఆయన కొంత వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. 2019లో పీఆర్‌టీయూ అభ్యర్థిగా పూల రవీందర్ బరిలో దిగారు. బీఆర్‌ఎస్ మద్దతు ప్రకటించినా టీజీ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. అయితే పీఆర్‌టీయూ రెబల్ అభ్యర్థిగా సరోత్తమ్‌రెడ్డి బరిలో ఉండటంతో పూల రవీందర్‌కు మైనస్‌గా మారింది. దీంతో ఈసారి పక్కాగా ఎమ్మెల్సీ సీటు దక్కించుకోవాలని పీఆర్‌టీయూ, సిట్టింగ్ సీటును నిలబెట్టుకోవాలని యూటీఎఫ్‌లు ప్రత్యేకంగా దృష్టి పెట్టగా, తపస్ సహకారంతో ఎమ్మెల్సీ సీటులో పాగా వేయాలని బీజేపీలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. వీరితో పాటు టీపీఆర్‌టీయూ నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి గాలరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కూడా బరిలోకి దిగారు. అయితే హర్షవర్ధన్‌రెడ్డికి కాంగ్రెస్ అధికారికంగా మద్దతు ఇస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. అలాగే టీచర్స్ జేఏసీ నుంచి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ నామినేషన్ దాఖాలు చేశారు. బీసీ ఓటు బ్యాంక్ లక్ష్యంగా మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ పోటీ చేస్తున్నారు. అలాగే సీపీయూఎస్ నుంచి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి సైతం బరిలో నిలవటంతో పోటీ రసవత్తరంగా మారనుంది. వీరితో పాటు మొత్తం 23మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినా 13వ తేదీ తరువాత ఎంత మంది పోటీలో ఉంటారో తేలనుంది.



నామినేషన్ దాఖలు చేస్తున్న డా. వెంకటస్వామి

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మద్దతు ఎవరికో?

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతో ప్రధాన ప్రతిపక్ష బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను బరిలో దించడం లేదు. దీంతో వీరి మద్దతు ఎవరికనేది ఉత్కంఠగా మారింది. బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే ఆ పార్టీ మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డిని బరిలో దించి ఇతర పార్టీలకు సవాల్ విసురుతోంది. అయితే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నుంచి కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు అభ్యర్థులను దించకపోవటంతో ఎవరికో ఒకరి మద్దతు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీ ఉద్యమం నేపథ్యంలో వరంగల్ కుడా మాజీ చైర్మన్ సుందరాజ్‌కు మద్దతుగా నామినేషన్లలో పాల్గొన్నారు. అయితే టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న హర్షవర్ధన్‌నరెడ్డి టీపీఆర్‌టీయూ నుంచి నామినేషన్ దాఖాలు చేశారు. అయితే ఆయనకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందా లేక ఇతర ఉపాధ్యాయ సంఘం నుంచి పోటీ చేస్తున్న మరెవరికైనా మద్దతు తెలుపుతుందా అనేది ఉత్కంఠగా మారింది. అలాగే బీఆర్‌ఎస్ సైతం ఇప్పటి వరకు ఎవరికి మద్దతు ప్రకటించలేదు. దీంతో పలువురు బీఆర్ ఎస్ మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల్లో కొంత వరకు పట్టున్న బీఆర్‌ఎస్ మద్దతు ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠగా మారింది.

మేడారంలో చిన్న జాతర సందడి

- రేపటి నుంచి నాలుగు రోజుల పాటు మినీ వేడుక
- తరలివస్తున్న భక్తులు.. పూర్తయిన ఏర్పాట్లు




జంపన్నవాగు ఒడ్డున పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

ములుగు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : తాడ్వాయి మండలం మేడారంలో చిన్న జాతర సందడి నెలకొంది. ఈనెల 12నుంచి నాలుగురోజులపాటు జరిగే జాతర కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవాదాయ, జిల్లా పంచాయతీ, నీటిపారుదల శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మల దర్శనానికి ఆదివారం సుమారు 40వేల మంది భక్తులు తరలిరాగా సోమవారం రద్దీ కొంత తగ్గింది. సుమారు 10వేల మంది వచ్చినట్లు అంచనా. పసుపు, కుంకుమలు, కానుకలను సమర్పించిన భక్తులు మేకలు, గొర్రెలు, కోళ్లను బలిచ్చారు. బుధవారం చిన్నజాతర ప్రారంభమవుతుండగా మంగళవారం సాయంత్రం నుంచి మళ్లీ రద్దీ పెరిగే అవకాశాలున్నాయి. గత చిన్న జాతరలకు భిన్నంగా ఈసారి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చొరవతో రూ.4కోట్ల వ్యయంతో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు కల్పించారు. 15రోజుల ముందునుంచే పారిశుధ్య పనులు మొదలయ్యాయి. పరిసరాలను బ్లీచింగ్ చేయడంతోపాటు యాంటీ లార్వా ద్రావకాన్ని పిచికారీ చేస్తున్నారు. 200మంది పారిశుధ్య కార్మికులు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. జంపన్నవాగులో ప్రవాహం లేకపోవడంతో భక్తుల పుణ్యస్నానాలకోసం బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు కంపార్ట్‌మెంట్లను నిర్మించారు. భక్తులు ఎక్కువగా విడిదిచేసే ప్రదేశాలలో నల్లాలు పునరుద్ధరించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ముఖ్య కూడళ్ల, జంపన్నవాగు పొడవునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. టీటీడీ కల్యాణ మండపంలో తాత్కాలిక వైద్యశాలను అందుబాటులోకి తెచ్చారు. ఆర్టీసీ నాలుగు రోజుల నుంచి 100 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తోంది. ఈనెల 15వ తేదీవరకు హనుమకొండ నుంచి మేడారానికి 400ట్రిప్పుల సర్వీసులను నడిపిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల భక్తులు తరలివస్తున్నారు. ఉమ్మడి వరంగల్‌జిల్లా నుంచి ఎక్కువ మంది బస్సులలో వస్తుండగా, మిగతా జిల్లాల నుంచి సొంత వాహనాలలో వస్తున్నారు. గద్దెల వద్ద చలువ పందిళ్ల వేయడంతో మధ్యాహ్నం వేళలో ఎండ నుంచి కొంత ఉపశమనం పొందుతున్నారు. రద్దీ ఎక్కువైతే క్యూలైన్‌ల ద్వారా అనుమతించనున్నారు. మహాజాతర సమయంలో మాదిరిగానే క్యూలైన్‌లు, గద్దెల వద్ద భక్తులకు ఉచితంగా తాగునీటిని సరఫరా చేయాలని భక్తులు కోరుతున్నారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రి వేళల్లో కూడా భక్తులు తల్లులను దర్శించుకుంటున్నారు.



వనదేవతల గద్దెల ముఖద్వారం వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

మంచు మేఘాల మీదుగా..



పొగమంచులో హనుమకొండ నగర వ్యూ

సూర్యోదయ సమయాన.. నీలి నింగిలో మంచు మేఘాలు కదులుతున్న వేళ.. హనుమకొండ నగర సుందర దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. సోమవారం ఉదయం నగరాన్ని పొగమంచు కమ్మేయగా.. 300మీటర్ల ఎత్తులో.. మంచు మేఘాల మీదుగా డ్రోన్ కెమెరాతో బంధించిన నగర చిత్రాలు ఎంతో ఆహ్లాదాన్నిపంచుతున్నాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



డ్రోన్ కెమెరాతో 300 మీటర్ల ఎత్తునుంచి 360 డిగ్రీల కోణంలో తీసిన చిత్రం

నిధులు లేక నిర్వీర్యం

నీరుగారుతున్న రైతువేదికల లక్ష్యం

- రెండేళ్లుగా రాని నిర్వహణ నిధులు
- ఉమ్మడి జిల్లాలో 334 రైతు వేదికలు
- రావలసిన బకాయిలు రూ.8.71కోట్లు
- ఏఈవోలపై నిర్వహణ భారం
- కానరాని రైతు శిక్షణా సమావేశాలు
- వేదికలకు సక్రమంగా వెళ్లని ఏఈవోలు

హనుమకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ సేవలను అన్నదాతలకు చేరువ చేసే ఉద్దేశంతో గత ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలను కష్టాలు చుట్టుముట్టాయి. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సేవలను రైతులకు మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్మించిన ఈ వేదికల నిర్వహణ వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు (ఏఈవో)లకు గుదిబండలుగా మారాయి. రైతులకు సలహాలు, సూచనలు అందించడం, అధికారులను అందు బాటు ఉంచాలన్న ఉద్దేశ్యంతో బీఆర్‌ఎస్ సర్కార్ రైతు వేదికలను నిర్మించింది. 2020లో వీటికి శ్రీకారం చుట్టగా, మూడు, నాలుగు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్‌గా విభజించి వాటిని నిర్మించారు. ఒక్కోదానికి రూ. 22 లక్షలకుపైగా వెచ్చించారు. రెండేళ్ళకుపైగా నిర్వహణ నిధులు కేటాయించకపోవడంతో వ్యవసాయ విస్తరణాధికారులే తమ జేబుల్లోంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 334 రైతు వేదికలను నిర్మించారు. ప్రతీ నెల నిర్వహణ ఖర్చుల కింద రూ. 3 వేలు కేటాయించారు.

2020 ఏప్రిల్‌లో వ్యవసాయ శాఖ నుంచి ఆదనంగా రూ. 6 వేలు కేటాయించి మొత్తం ఒక్కో రైతు వేదికకు రూ. 9 వేల చొప్పున అందజేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మొత్తంలో పరిశుభ్రతకు రూ. 3 వేలు, శిక్షణకు రూ. 2,500, స్టేషనరీకి రూ. 1,000, విద్యుత్ బిల్లుకు రూ. 1,000, ఇతరత్రా వాటికి రూ. 1,500 చొప్పున వెచ్చించాలని అప్పట్లో నిర్ణయించారు. 2022 ఆగస్టు వరకు నిధులు కేటాయించిన ప్రభుత్వం తర్వాత నిలిపివేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ. 8,71,74,000 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఫలితంగా అసలు లక్ష్యం నీరుగారుతోంది.

ఏఈవోలే అటెండర్లు..

రైతు వేదికలకు అటెండర్ కూడా లేకపోవడంతో ఏఈవోలే అన్ని పనులు చేసుకుంటున్నారు. రోజూ తాళం తీయడం, గదులను శుభ్రం చేసుకోవడం, ఏవైనా సమావేశాలు ఉంటే ఏర్పాట్లు చేయడం అన్నీ ఏఈవోలే చేయాల్సి వస్తోంది. రైతువేదికలకు వాచ్‌మెన్లు కూడా లేకపోవడంతో అందులోని విలువైన సామాన్లు దొంగలపాలవుతున్నాయి. రైతుల సమావేశాల నిర్వణకు ఉద్దేశించిన కుర్చీలు, బెంచీలను దొంగలు ఎత్తుకు పోతున్నారు. గ్రామాల్లో మట్టి నమూనాల పరీక్షలు చేసి భూసార ఫలితాలను రైతులకు అందించడం కోసం ఒక్కో రైతు వేదికకు మినీ ల్యాబ్ కిట్లు అందజేశారు. మొదట్లో కొన్ని రసాయనాలు అందించారు. తరువాత వాటి నిర్వహణకు నిధులు, రసాయనాలు ఇవ్వకపోవడంతో ప్రస్తుతం భూసార పరీక్ష కిట్లు మూలకు పడ్డాయి. మట్టి నమూనాల పరీక్షల ప్రక్రియ అటకెక్కింది. రైతు వేదికలకు నిర్వహణ నిధులు ఇవ్వకపోవడంతో చివరకు కరెంట్ బిల్లులు కట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యుత్ శాఖ నుంచి వ్యవసాయాధికారులకు హెచ్చరికలు వస్తున్నాయి. కొన్ని చోట్ల రైతు వేదికలకు కరెంట్ తొలగించడంతో అక్కడ నిర్వహించాల్సిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాలు ఆగిపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో బకాయిలిలా..

జిల్లా	రైతువేదికల సంఖ్య	బకాయిలు
హనుమకొండ	55	రూ. 1,43,55,000
వరంగల్	59	రూ.1,53,99,000
జనగామ	62	రూ. 1,61,82,000
ములుగు	31	రూ. 80,91,000
జయశంకర్ భూపాలపల్లి	45	రూ. 1,17,45,000
మహబూబాబాద్	82	రూ. 2,14,02,000
మొత్తం	334	రూ. 8,71,74,000

ఊళ్లకు దూరంగా..

ప్రతీ రైతు వేదికలో ఏఈవో, రైతువేదికకో ఆర్డినేటర్లకు ఒకటి చొప్పున చాంబర్, 200 మంది రైతులు కూర్చునేందుకు వీలుగా సమావేశ మందిరం, రెండు మరుగుదొడ్లు నిర్మించారు. ఒక్కో వేదిక కోసం కనీసం అర ఎకరం, భూమి లభ్యత ఉన్న చోట ఎకరం ప్రభుత్వం కేటాయించింది. రైతు వేదిక నిర్మాణ బాధ్యతలు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. అయితే ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో చాలా వరకు రైతు వేదికలను ఊరు చివరన నిర్మించారు. వీటిలో చాలా వాటికి అక్కడికి చేరుకోవడానికి రోడ్డు సౌకర్యం కూడా లేదు. వర్షా కాలం వస్తే అంత బురదమయంగా మారి అధికారులు, రైతులు అక్కడికి వెళ్లలేని పరిస్థితులు ఏర్పడతాయి.



వర్ధన్నపేట మండలం కట్ర్యాలలోని రైతు వేదిక

నీరుగారుతున్న లక్ష్యం..

నిర్వహణ నిధులు ప్రభుత్వం ఇవ్వకపోవడం, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించకపోవడంతో రైతు వేదికల లక్ష్యాలు నీరుగారుతున్నాయి. రైతు వేదికల్లో రైతు సమన్వయ సమితి సమావేశాలు నిర్వహించాలి. ఖరీఫ్, రబీల్లో ఎలాంటి పంటలు వేసుకుంటే రైతులకు లాభం చేకూరుతుందో వ్యవసాయ శాఖ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి వివరించాలి. పొలాలకు సంబంధించిన భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలు వెల్లడించాలి. భూసార ఫలితాలకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేసుకునేలా వ్యవసాయాధికారులు చొరవ చూపాలి. కానీ వ్యవసాయ విస్తరణాధికారులు విధుల నిర్వహణలో బిజీగా ఉండడం, తరుచూ సర్వేలు చేసేందుకు పొలాల చుట్టూ తిరగడంతోనే సరిపోవడంతో రైతువేదికలను పట్టించుకునే తీరిక వారికి లేకుండా పోయింది. ప్రతీ రోజు ఉదయం విధిగా రావాల్సిన వీరు వారానికి ఒకటి రెండు సార్లు చుట్టపు చూపుగా వస్తున్నారు. కొన్ని చోట్ల ఏఈవోలు ఉదయం వచ్చి ఆ వెంటనే తమ క్షేత్ర పర్యటనకు వెళ్లిపోతున్నారు. దీంతో రైతు వేదికలకు ఎప్పుడు చూసినా తాళాలు వేలాడుతూ కనిపిస్తున్నాయి.



హసన్‌పర్తి మండలం నాగారంలోని రైతు వేదిక

రూ.8.71 కోట్ల బకాయిలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 334 రైతు వేదికలుండగా రూ. 8.71 కోట్ల నిర్వహణ నిధుల బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. 27 నెలల నుంచి మండల వ్యవసాయ విస్తరణాధికారులు (ఎంఈవోలు) తమ నెలవారీ వేతనాల నుంచి నిర్వహణ ఖర్చులు భరిస్తున్నారు. విద్యుత్, పారిశుధ్య నిర్వహణ, మరమ్మతులు, స్టేషనరీ, రైతు శిక్షణ, తాగునీటి సౌకర్యాలకు కూడా నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఏఈవోలు చెబుతున్నారు. ఒక్కో రైతు వేదికకు రూ. 2.43లక్షలు రావాల్సి ఉంది. రైతు సమావేశాలు జరిగినప్పుడు తాగునీరు, తేనీటికి కూడా తామే డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఏఈవోలు చెబుతున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతులు సమావేశమై సాగు సమస్యలు, ఆధునిక పద్ధతులపై చర్చించేందుకు వీలుగా ప్రతీ శాసన సభ నియోజకవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు విడుల చేయకపోడంతో కార్యాలయ పరిశుభ్రత, ఇతరత్రా పనులు కూడా తామే చేయాల్సి వస్తోందనీ సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కొండాయి జాతరకు సన్నద్ధం

- 'మినీ' వేడుకకు సర్వం సిద్ధం
- 12న గోవిందరాజులు, నాగులమ్మకు ప్రత్యేక పూజలు
- దొడ్లలో సారలమ్మ జాతర


కొండాయిలో ముస్తాబైన గోవిందరాజులు, నాగులమ్మ ఆలయాలు


దొడ్లలో సారలమ్మ ఆలయం

ఏటూరునాగారం రూరల్, ఫిబ్రవరి10, (ఆంధ్ర జ్యోతి): అటవీ పల్లెల్లో జాతర కోలాహలం మొద లైంది. గిరిజన పల్లెలో కొలువైన వన దేవతల జాత రకు సర్వం సిద్ధమైంది. మండలంలోని కొండాయిలో కొలువైన గోవిందరాజుల, నాగులమ్మ మినీ జాతర ఈనెల 12న ప్రారంభం కానుంది. వన దేవతల దర్శనా నికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికా రులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గోవిందరాజుల, నాగులమ్మ గుడులను ముస్తాబు చేశారు. అదేవిధంగా దొడ్లలోని సారలమ్మ గుడిని అలంకరించారు. కొండా యిలో గోవిందరాజుల జాతరను ఆలయ పూజారులు దబ్బకట్ల వంశస్థులు ఘనంగా నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేశారు.

రూ. 72 లక్షలతో ప్రత్యేక పనులు

కొండాయిలో మినీజాతర నేపథ్యంలో రూ. 72లక్షల వ్యయంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. గోవింద రాజుల గుడి ప్రాంగణంతో పాటు సమ్మక్క- సారల మ్మల గద్దెల వద్ద అభివృద్ధి పనులను చేపట్టారు. ప్రహ రీ నిర్మాణం, విద్యుత్తు అలంకరణ, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలను ఆలయాల ప్రాంగ ణంలో చేపట్టారు. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. కన్నాయిగూడెం మండలంలోని ఐలాపురంలో సమ్మక్క- సారల మ్మ జాతరకు వెళ్లే భక్తులు కొండాయి మీదుగా వెళుతూ గోవిందరాజులు, నాగులమ్మ దేవత మూర్తులను దర్శనం చేసుకొని వెళ్లడం పరిపాటి. ఈ నేపథ్యంలో అధికారులు కొండాయిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పూజారులు కోరుతున్నారు.

ఐటీడీఏ పీవోకు ఆహ్వానం

ఏటూరునాగారం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ప్రారంభం కానున్న కొండాయి మినీ జాత రకు రావాలని ఆలయ పూజారులు సోమవారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాకు ఆహ్వాన పత్రం అందించారు. మండ లంలోని కొండాం యిలో కొలువైన గోవిందరాజులు, నాగు లమ్మ మినీ జాతర నేపథ్యంలో ఆలయ పూజారులు దబ్బకట్ల గోవర్ధన్ రఘు, రూపేష్, గౌరి తదితరులు ఐటీడీఏ కార్యాలయంలో పీవోను మర్యాదపూర్వకంగా కలిసి జాతరకు రావాలని కోరారు. ఈనెల 12న కొండా యిలో జాతర ప్రారంభం కానున్నదని, జాతరకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆలయ పూజారులు కోరారు.


ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాకు ఆహ్వాన పత్రం అందిస్తున్న గోవిందరాజుల పూజారులు

రైతులకు బోరుబావులు మంజూరు చేయాలి : కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) మాతోట కార్యక్రమంలో భాగంగా ఉద్యాన రైతులకు బోర్‌బావులు మంజూరు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, అటవీ అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. మాతోట కార్యక్రమంపై సమీక్షించారు. మహాము త్తారం మండలంలోని పలు గ్రామాల్లో నాబార్డు ఆధ్వర్యంలో మా తోట కార్యక్రమాన్ని చేపట్టి గిరిజన రైతులు పండ్ల తోటలు సాగుచేస్తున్నారన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని మొక్కల సంరక్షణకు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. మండలంలో సుమారు 10 బోరుబావులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్


బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈవో రాజేందర్

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫిజికల్ టాలెంట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. భూపాలపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఈ టెస్టును నిర్వహించగా పలు పాఠశా లల విద్యార్థులు హాజరయ్యారు. డీఈవో రాజేందర్ పర్యవేక్షించారు. ఈ పరీక్షలో కాటారం ఆశ్రమ పాఠశాలకు చెందిన మణిదీప్ ప్రథమ బహుమతి గెలుపొందగా, కాళేశ్వరం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన అలేఖ్య ద్వితీయ, ఆశ్రమ పాఠశాలకు చెందిన అభిభగవాన్ మూడో బహుమతి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు లక్ష్మణ్, రమేష్, రాజగోపాల్, జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, జిల్లా ఫిజికల్ సైన్స్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గండు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూత

కాటారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాలుగురోజుల క్రితం ఇసుక లారీ ఢీకొని కొంతదూరం ఈడ్చుకెళ్లగా తీవ్రగాయాలతో రెండు కాళ్లు కోల్పోయిన సబ్‌స్టేషన్‌పల్లికి చెందిన తోట రవికి చేయూతనందించారు. సోమవారం పలువురు దాతల సహకారంతో జమ చేసిన రూ.1.55 లక్షల నగదును చీమల రాజు ఆధ్వర్యంలో రవి కుటుంబానికి అందజేశారు. ప్రమాద తీవ్రత కలిచివేయడంతో చీమల రాజు ముందుకొచ్చి మిత్రబృందం సహకారంతో సోషల్‌మీడియా వేదికగా రవిని ఆదుకో వాలని విజ్ఞప్తి చేయడంతో పలువురు వ్యాపారులు, నాయకులు, ప్రజలు స్పందించి డబ్బులు అందించారు. వాటిని బాధితుడు రవి తల్లి రాధమ్మ, కుమారుడు జయ కృష్ణలకు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యాపారులు, నాయకులు చీమల రాజయ్య, జనగామ కరుణాకర్‌రావు, బచ్చు ప్రకాశ్ ఆత్మకూరి కుమార్, మాచెర్ల రాజేందర్, రమేష్, సతీష్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా ప్రసాద్

మల్హర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన జల్లారపు ప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియామకం చేపట్టిన జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

అందరి సహకారంతో కుంభాభిషేకం సక్సెస్

కాళేశ్వర ఆలయ ఈవో

మహదేవపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో మహా కుంభాభిషేక ఘట్టం పూర్తయిందని కాళేశ్వర ఆలయ ఈవో మహేష్ తెలిపారు. సోమవారం ఆయన ఆలయంలో మాట్లాడారు. మహా కుంభాభిషేక కార్యక్రమానికి కృషి చేసిన కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతోపాటు అర్చకులు, పండితులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీ, ఇరిగేషన్, ఆర్టీసీ, పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు.

కొత్త విద్యుత్ సర్వీసు మంజూరు సులభం : ఎస్ఈ

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు మరింత సులభతరమైందని విద్యుత్ శాఖ ఎస్ఈ మల్సూర్ నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వినియోగదారుడికి కొత్త సర్వీసును మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ఏదైనా కారణం చేత దరఖాస్తు తిరస్కరణకు గురైతే మరోసారి చేసుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా చేసిన దరఖాస్తుతో వినియోగదారునికి వెంటనే మెసేజ్ వచ్చేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

మహాముత్తారం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుగుపల్లి ఉన్నత పాఠశాలకు పోలారం, ఆంకుసాపూర్ గ్రామాల నుంచి నడిచి వస్తున్న ఆరుగురు విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన స్ట్రీట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సొసైటీ ఉపాధ్యక్షుడు ఎం.కల్యాణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దూలం మల్లయ్య, ఎంఈవో సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, అనిల్‌నాయక్, సక్రాంనాయక్, సతీష్‌రెడ్డి, చంద్రకళ, యాదగిరి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

గోపాలమిత్రల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ మల్లీశ్వరి

టేకుమట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులు గోపాల మిత్రల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవ ర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ మల్లీశ్వరి అన్నారు. మండలంలోని పంగిడిపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ వీర్యంతో పుట్టిన మేలుజాతి దూడల ప్రదర్శన, ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ మల్లీశ్వరి హాజరయ్యారు. ప్రదర్శనలో ఉంచిన 68 దూడలను ఆమె పరిశీలించారు. అనంతరం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. పాడి రైతు లు పశువులకు కృతిమ గర్భధారణ చేయించుకోవాలని రైతు లకు సూచించారు. మండలంలోని గోపాలమిత్రల సేవలను పాడి రైతులు ఉపయోగిం చుకోవాలన్నారు. మేలు జాతి దూడ లను పెంపొందించుకుంటే అవే పాడిపశు వులు అవుతాయని, వాటి ద్వారా రైతులు అనేక విధాలుగా లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కుమారస్వామి, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యని ర్వహణాధికారి రఘుబాబు, గోపాలకృష్ణమూర్తి, వెంకన్న, వివిధ మండలాల పశువైద్యాధికారులు వివేక్, రాజబాబు, రాకేష్‌శర్మ, శంకర్, శారద, గోపాలమిత్రలు కుమారస్వామి, ప్రకాశ్‌రెడ్డి, ఐలుమల్లు, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, అఫ్జల్, రాజేందర్, సతీష్ పాల్గొన్నారు.


ప్రదర్శనలో దూడలను పరిశీలిస్తున్న మల్లీశ్వరి

విజ్ఞాన విహారయాత్రకు విద్యార్థులు

మహాముత్తారం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లకుంట, లింగాపూర్, జీలపల్లి, మాదారం, స్తంభంపల్లి(పీపీ) వజినేపల్లి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు ఆదివారం విజ్ఞన విహారయాత్రకు వెళ్లారు. మొదటగా పరకాల అమరధామానికి చేరుకున్నారు. అనంతరం హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం, పురవాస్తు కేంద్రం, ఖిలావరంగల్, ఏకశిలగుట్ట, కాకతీయ తోరణాలు తదితర చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆప్రదేశాల విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరిష, కృష్ణమోహన్, వరినాయక్, హనుమంతు, సతీష్‌కుమార్, సుమలత, రాజబాపు, రమాదేవి, కృపాకర్, సద్య, రాజేంద్రప్రసాద్, మౌనిక, జోత్స్న, కరుణ తదితరులు పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం

మల్హర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్లలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. గ్రామంలోని పెద్దమ్మ తల్లి గుడి నుంచి బీసీ కాల నీకి వెళ్లే మార్గంలో మామిడి తోట వద్ద ఆదివారం అర్ధరాత్రి ఈ పూజలు జరిగినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. గొర్రెపిల్లను బలిచ్చి, పక్కనే ఇస్తారాకులో కుంకుమ, పసుపు ముద్దలు, నిమ్మకాయలు ఉన్నాయి. ఉదయం పూట అటుగా వెళ్లిన వారు చూసి ఒక్కసారి భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం దావనంలా ఊరంతా వ్యాపించింది. దీంతో సమీప కాలనీ వాసులు ఆందోళనకు గురవుతున్నారు.

మహదేవపూర్ మండలంలో..

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరారం గ్రామశివారు రాపల్లికోట క్రాస్ వద్ద సోమవారం ఉదయం క్షుద్రపూజలు కలకలం రేపాయి. ఆదివారం రాత్రి కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు నిమ్మకాయలు, నల్లకోడి, కోడిగుడ్లతో మహదేవపూర్, రాప ల్లికోట, సూరారం మూడు గ్రామాలకు వెళ్లే కూడలిలో పూజ లు చేసినట్లు తెలుస్తోంది. ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లిన కొంత మంది ఈ ఆనవాళ్లు చూసి భయాందో ళనలకు గురయ్యారు. గతంలో ఇదే క్రాస్ వద్ద మేక, కోడితో క్షుద్రపూజలు చేశారు.

అంగన్‌వాడీ కోడిగడ్లతో..

క్షుద్రపూజల్లో అంగన్‌వాడీ కోడిగుడ్లు వాడటం చర్చనీ యాంశమైంది. చిన్నపిల్లలు, గర్భిణులకు పంపిణీ చేయా ల్సిన కోడిగుడ్లు ఇలా రోడ్లపై దర్శనమిస్తుండటంపై విస్మ యం వ్యక్తమవుతోంది. ప్రజాపంపిణీకి వినియోగించే కోడిగుడ్లు పక్కదారి పడుతున్నాయనే విమర్శలు వ్యక్తమ వుతున్నాయి.

యోగా, ధ్యానంతో బహుళ ప్రయోజనాలు

కాటారం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): యోగా, ధ్యానంతో శారీరక, మానసికోల్లాసం లాంటి బహుళ ప్రయోజనాలు కలుగుతాయని రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ మాస్టర్ ట్రైనర్ వెంకటయ్య అన్నారు. కాటారం మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగా, ధ్యాన శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ట్రైనర్ వెంకట య్య, జిల్లా కోఆర్డినేటర్ చెరుకుపల్లి రవీందర్ పలువురు సాధకు లతో కలిసి యోగా, ధ్యానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు నిత్యం అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోడానికి యోగా, ధ్యానం ఉపయోగపడ తాయన్నారు. మూడు రోజుల శిక్షణతో సాధకుల్లో ఆత్మవిశ్వాసం, సాత్విక ఆలోచనలు పెరుగుతా యన్నారు. ఈ కార్యక్రమంలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధులు మాధవి, లక్ష్మణ్, సాధకులు మాధవరెడ్డి, విష్ణు, నాగరాజు, శివ, సమ్మయ్య, రమాదేవి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జయశంకర్ విగ్రహం సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. కాటారం వైపు నుంచి పరకాల వైపు వెళ్తున్న కారు జయశంకర్ విగ్రహం సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న ద్విచక్ర వాహనదారుడిని వేగంగా ఢీకొంది. ఆ బైక్‌పై ఉన్న వరికోల్ గ్రామానికి చెందిన రాజేశం గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 ద్వారా భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం

మంగపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఎవరూ లేని సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి గుడిసె పూర్తిగా కాలి బూడిదైన సంఘటన మండలంలోని తిమ్మంపేట ఎస్సీ కాలనీ (నేతకానివాడ)లో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్థులు కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మంపేట నేతకానికాలనీకి చెందిన గాందెర్ల సమ్మయ్య- సమ్మక్క దంపతులకు చెందిన గడ్డి ఇల్లు ఉంది. సోమవారం ఇంట్లోని వారు కూలి పనికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టు పక్కల వారు ఫోన్‌లో సమ్మయ్యకు సమాచారం ఇచ్చి మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దీంతో మహిళా సంఘం లోన్ చెల్లించేందుకు తీసుకొచ్చిన రూ. 20 వేల నగదు, దుస్తులు, బియ్యం, బీరువా, వంట సామగ్రి తదితర సామాన్లు కాలిపోయి సుమారు రూ. 2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ఘటన స్థలానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది చేరుకొని పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా 25 కిలోల బియ్యం. నిత్యావసర సరుకులు, కొంత నగదును అందజేశారు.

ఆలయాల్లో భక్తుల సందడి


ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో భక్తులు

మంగపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బోరు నర్సాపురంలో వెలిసియున్న శ్రీసీతా రామాంజనేయస్వామి, మం గపేట లో వెలిసియున్న శ్రీ ఉమాచం ద్రశేఖర స్వామి దేవాల యాల్లో మాఘమాసంలోని పునర్వసు నక్షత్ర మైన సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సీతారామాం జనేయస్వామిని, శ్రీ ఉమాదేవి (పార్వ తిదేవి) చంద్రశేఖర (శివుడు) స్వామిని దర్శించుకున్నారు. సీతారామాం జనేయస్వామి ఆలయంలో శ్రీరాముల పాదాలకు ఆవుపాలు, నెయ్యి, తేనె, పలు పండ్ల రసాలతో ఆలయ పూజారి జిడికండి శ్రీనివాసాచార్యులు అభిషేకం నిర్వహించారు. మంగపేట ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూలవిరాట్టైన శివలింగానికి ప్రధా నార్చకుడు విస్సావజ్ఝుల నరేష్‌శర్మ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వ్యాపారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గొంతెమ్మగుట్ట మహాజాతర

(5వ పేజీ తరువాయి)


సొరంగం వద్ద కృష్ణుడి పాదాలు, శివలింగానికి భక్తుల పూజలు

మ్యాక అభినవ్, శ్రీనివాస్ బందోబస్తు చేపట్టారు. పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక నేతృత్వంలో సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు దాతల సహకా రంతో జాతర కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, నాయకపోడు కళాబృందాల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మహా జాతర నిర్వహణ కమిటీ సభ్యులు మేకల సంతోష్, గుంటి రాజేందర్, మేకల పోచం, కిష్టయ్య, మధునయ్య, పోలం రాజేందర్, మేకల పోచయ్య, ఎర్రయ్య, బీసుల రవీందర్, ఎర్రయ్య, గుంటి రాజు, ధర్మేంద్ర, దేవయ్య, ప్రతాప్, లస్మయ్య, కిష్టయ్య, బుచ్చయ్య, లక్ష్మయ్య, మధునక్క కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పెద్ద పట్నం వేయిస్తున్న జాతర కమిటీ సభ్యులు

అడవుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

వాజేడు, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి): అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై రేంజర్ చంద్రమౌళి సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కోయవీరాపురం, కృష్ణాపురం, ఎడ్జెర్లపల్లిలో అవగాహన సదస్సులను ఫారెస్టు అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా వన్యప్రాణుల రక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. అడవుల్లోకి వెళ్లినపుడు నిప్పు పెట్టడం వల్ల జంతువులతో పాటు అరుదైన మొక్కలు దగ్ధమవడంతో పర్యావరణ సమతుల్యతకు నష్టం వాటిల్లుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు నారాయణ, నాగమణి, బీట్ ఆఫీసర్లు రామ్మూర్తి, పుణ్యమయ్య, మణిషా, గంగాభవాని, పద్మప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయిగూడెం జాతర పోస్టర్ ఆవిష్కరణ

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుట్టాయి గూడెంలో ప్రతి రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర పోస్టర్‌ను పూజారులు, గ్రామస్థులు ఆవిష్కరించారు. ఈనెల 19 నుంచి 22 వరకు నాలుగు రోజుల పాటు జాతర జరగనుందని పూజారులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవర బాలలు దేవర సత్యం, దేవర సుధాకర్, మేడారం ట్రస్టు బోర్డు డైరెక్టర్ పొడెం శోభన్, మాజీ సర్పంచ్ కావేరి చిన్ని కృష్ణ, ఎంపీపీ జనగాం సమ్మక్క, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు, సాంబశివరావు, పోలయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్

ములుగు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 12, 13తేదీలలో అన్ని మండల కేంద్రాలలో బ్లాక్‌లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు యువకేంద్రం వాలంటీర్ నవీన్‌యాదవ్ ఒక ప్రకట నలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, రన్నింగ్, తదితర ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ ప్రదానం చేస్తామని తెలిపారు. 9502126384, 9505496034కు ఫోన్‌చేసి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


స్వయం పరిపాలనా కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

గోవిందవుపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారారు.. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండలంలోని చల్వాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. నాలగు, ఐదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర వహించి స్వీయ అనుభవం పొందారు. ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని, విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడాలని ప్రధానోపా ధ్యాయుడు హట్కర్ సమ్మయ్య అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.వాసుదేవరెడ్డి, మాధవి, లత, రాణి, పావని, స్రవంతి, మమత, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

ఏటూరునాగారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం ఎక్సైజ్ కార్యాలయ సర్కిల్ పరిధిలోని పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఏడు వాహనాలకు మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎక్సైజ్ కార్యాల యంలో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ ఎల్. రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు వేలం నిర్వహిం చనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ప్రభుత్వం నిర్ణీత ధరలో 50 శాతం డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సీఐ కోరారు. ఉదయం 11 గంటల నుంచి వేలం జరుగుతుందని తెలిపారు.

నేతకానీల సంక్షేమానికి పాటుపడాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నేతకానీల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడాలని తెలంగాణ నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘంజిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతకానీ సంక్షేమానికి ప్రత్యేక కోటా, కేటగిరీ కేటాయించా లన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఎస్సీ కుల వర్గీకరణ నేతకాని కులానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నేతకాని సామాజిక వర్గం జనాభా 1,33,000 మంది మాత్రమే అని చెప్పడం అసత్యం అన్నారు. ఈ సమావేశంలో నేతకాని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డిగొండ కాంతారావు, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు కుమ్మరి చంద్రబాబు, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి రాంబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీకాంత్, రాష్ట్ర నాయకులు బక్కయ్య, కొండగొలర్ల పోచయ్య, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతర భక్తుల వైద్య సేవలకు ఏర్పాట్లు పూర్తి

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయిలో బుధవారం నుంచి జరగనున్న సమ్మక్క సారలమ్మల జాతరలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్ అన్నారు. సోమవారం ఆయన పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినవ్‌తో కలిసి ఐలాపూర్‌లో ఏర్పాటు చేసిన కంటైనర్ అదనపు ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధి లోని కొండాయి, ఐలాపూర్ సబ్ సెంటర్లకు మందులు పంపిణీ చేశారు. కొండాయి, ఐలాపూర్ జాతరలో అనారోగ్యానికి గురైన భక్తులకు వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ ప్రోగ్రాం మేనేజర్ మహేందర్, డీపీఎల్ఎం స్వామి, హెల్త్ అసిస్టెంట్లు భాస్కర్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.